# కాంపన్సేషన్

ఆడపిల్లలు చదువుకోడమే అపురూపమైన రోజుల్లో అమృతవల్లిని తండ్రి మాథమేటిక్స్‌లో ఎమ్.ఎస్.సి. చదివించాడు. ఉమెన్స్ కాలేజిలో లెక్చరరుగా చేరింది. తోటి లెక్చరరు అయిన నందనరావుని ప్రేమించి, పెళ్లి చేసుకుంది. కులాంతరమయినా, తల్లిదండ్రులు ఆమోదించారు. నందనరావు సైకాలజీ లెక్చరరు. గుణవంతుడు. వారికి అభ్యంతరం కన్పించలేదు.

అమృతవల్లికి మాత్రం అసంతృప్తి. మాథమేటిక్స్‌లో ఆమెది అత్తెసరు మార్కులే. ఆడపిల్లలు ఎక్కువగా చదువుకోని రోజులు కాబట్టి ఆమెకు సీటు వచ్చి, చదువు సులువుగా సాగింది. అయినప్పటికీ, తనని ఇంజనీరింగ్ చదివించలేదని ఆమెకు తండ్రి పై కోపం. అన్నయ్యకు ఇంజనీరింగ్ చెప్పించారు. నాకు చెప్పించారా అని అడుగుతూ ఉండేది. కనీసం ఇంజనీరు భర్తనైనా తెచ్చారా అనేది!

నీది ప్రేమ వివాహం అనే ధైర్యం తండ్రికి లేదు. ఆ మాటే అంటే నేను ప్రేమించి పెళ్లి చేసుకోకపోతే, మీరు కట్నానికి చూసుకుని నాకు పెళ్లే చెయ్యరు అని యాగీ చెయ్యగల సత్తా అమృతవల్లికుంది.

తండ్రి మాట్లాడేవాడు కాదు. అమృతవల్లిలో అసంతృప్తి ఆకాశం ఎత్తుకు ఎదిగిపోయింది.

❖ ❖ ❖

అందరిలాగే ఒక పిల్లా, పిల్లాడూ పుట్టగానే ఫుల్‌స్టాప్ పెట్టారు అమృతవల్లి దంపతులు.

ఆడపిల్లపై ఆశలు పెంచుకుంది అమృతవల్లి. అబ్బాయి చదువుని అంతగా పట్టించుకోలేదు.

"పాపా! నువ్వు ఇంజనీరింగ్ చదివి పెద్ద కంపెనీలో పని చెయ్యాలి" అనేది.

పాపకే చెప్పినా, అమృతవల్లి కొడుకు ఆ మాటలు పట్టించుకున్నాడు. అతనికి ఐ.ఐ.టి.లో సీటు వచ్చింది.

అమృతవల్లి కూతురు హైమ కూడా చాలా బాగా చదివేది. టెన్త్ క్లాసులో మంచి మార్కులతో పాసయి ఇంటర్మీడియట్‌లో చేరింది.

భర్త కొద్దిగా అభ్యంతరం చెప్పాడు. అమ్మాయి సుకుమారి. ఇంజనీరింగ్ కన్నా మామూలు డిగ్రీ చదివించి ఐ.ఎ.ఎస్.కి పంపిద్దాం.'

"మీ ఆలోచనలు అలాగే ఉంటాయి. అసలు మాథమేటిక్స్ చదివితే కదా మీకు ఇంజనీరింగ్ అంటే ఏమిటో తెలియడానికి? - నా కూతురు విషయం నేను చూసుకుంటాను" అంటూ భర్తని మాట్లాడకుండా ఆపింది అమృతవల్లి.

"హైమ ఇష్టం కనుక్కున్నావా?" అని అడిగిన తండ్రితో - "నా ఇష్టం అడిగే నన్ను చదివించారా? ఆడపిల్లని కదా అని ఇంజనీరింగ్ చెప్పించలేదు. నాకు జరిగిన అన్యాయం నా కూతురుకి జరగడానికి వీల్లేదు" అంది.

నందనరావు భార్యతో "అమృతా! నువ్వు పొరబడుతున్నావు. ఇంజనీరింగ్ చదవాలన్నది నీ కోరిక. నీకు తీరని కోరికను నువ్వు అమ్మాయి నెత్తిమీద రుద్దేస్తున్నావు. ఇలా తల్లిదండ్రులు తమకు తీరని కోరికలను పిల్లల మీద రుద్దెయ్యడాన్నే కాంపన్సేషన్ టెక్నిక్ ఇన్ డిఫెన్స్ మెకానిజం అని మా సైకాలజిస్టులంటారు. అమ్మాయి అభిప్రాయం అడుగుదాం" అన్నాడు.

"మీ బోడి సైకాలజీ నా దగ్గర చెప్పద్దు. కావలిస్తే అమ్మాయిని అడుగుదాం. హైమా!ఏం చదువుతావు?" అంది అమృతవల్లి.

"నీ ఇష్టం మమ్మీ" అంది హైమ.

అమృతవల్లి గర్వంగా తల ఎగరేసి "నా ఆశలన్నీ నీమీదే పెట్టుకున్నాను.. నువ్వు పెద్ద ఇంజనీరువి కావాలి" అంది.

రోజూ ట్యూషన్లతో పాటుగా తల్లి ఆశలు వినడానికి కొంత టైం కేటాయించింది హైమ.

పరీక్షలు దగ్గర పడ్డ కొద్దీ ఆమె గుండెలలో రైళ్లు పరిగెత్తసాగాయి. తల్లి తన మీద ఎన్ని ఆశలు పెట్టుకుంది. తను నిజంగా ఎంట్రెన్స్ పాసవగలదా? ఇంజనీరు అవుతుందా?

ఎంట్రెన్స్ ఎగ్జామినేషన్ ముందు రాత్రి పన్నెండు గంటలదాకా హైమ చేత మోడల్ పేపర్స్ చేయించింది అమృతవల్లి. మర్నాడు పొద్దుట అయిదుగంటలకే నిద్రలేపింది.

పరీక్షహాల్లోకి వెడుతున్నప్పుడు కూడా 'నా ఆశలన్నీ నీమీదే పాపా! నువ్వు ఇంజనీరు కావాలి' అంది.

క్వశ్చన్ పేపర్ చూస్తున్న హైమ మనస్సులో ఒక్కటే ప్రశ్న. తల్లి ఆశలు తీర్చగలదా?

ఆ ప్రశ్న తప్ప ఆమెకు పేపర్‌లోని ప్రశ్నలు కన్పించలేదు.

ఆమె కలం కదలకుండా ఆగిపోయింది.

ఇంకా చెప్పాలంటే ఆమె జీవితమే ముందుకు వెళ్లకుండా ఆగిపోయింది.

(ఆంధ్రప్రభ వీక్లీ)